## క్లుప్తంగా

### మృతురాలి కుటుంబానికి 'సిపాయి భరోసా'



నిత్యావసర సరకులు అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఏర్పేడు: మండలంలోని దుర్గిపేరి గ్రామానికి చెందిన దొడ్డి మునెమ్మ(49) గత వారం మృతి చెందింది. గురువారం మృతురాలి కుటుంబాన్ని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పరామర్శించారు. సిపాయి భరోసా పథకం కింద 40 రకాల నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు రమణ, బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు దశరథరామిరెడ్డి, మునిచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నాడు-నేడు పనులను వేగవంతం చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నాడు-నేడు రెండవ విడత పనులను వేగవంతం చేసి, వేసవి సెలవుల్లో పూర్తి చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు అన్నారు. గురువారం ఆయన ఎంఈఓ రవీంద్రనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలిమతో నాడు-నేడు పనులపై సమీక్షించారు. నాడు-నేడు మొదటి విడతలో 27 పాఠశాలల్లో రూ. 5 కోట్లతో పనులను పూర్తి చేశామన్నారు. రెండవ విడతలో రూ.6 కోట్లతో 22 పాఠశాలల్లో నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

### మేర్లపాకలో ఉచిత వైద్య శిబిరం



ఏర్పేడు: మండలంలోని మేర్లపాక ఎస్సీ కాలనీలో గురువారం సర్పంచ్ గంగాధరం, ఏర్పేడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు రక్తపోటు, మధుమేహం, రక్త పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ రాఘవరెడ్డి మాట్లాడుతూ, ఎండతీవ్రత ఎక్కువగా ఉందన్నారు. వ్యవసాయ కూలీలు, ప్రజలు ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇళ్ల వద్దనే ఉండాలని సూచించారు. ఎండ తీవ్రత మూలాన వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భరత్‌కుమార్, ఏఎన్‌ఎం సుజాత, అంగన్‌వాడీ కార్యకర్త లావణ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

### భక్తిప్రపత్తులతో అష్టమి పూజలు

పిచ్చాటూరు: మండలంలో రామగిరిలోని శ్రీ సంతాన కాలభైరవ స్వామి ఆలయంలో గురువారం అష్టమి పూజలు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం ఆలయంలోని కాళభైరవస్వామి, శ్రీ వాలీశ్వరస్వామి, శ్రీ మరగదాంబిగ అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు, విశేష అలంకారం చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు నేతి దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి అర్చకులు ఆశీర్వచనాలు పలికారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ సురేష్, పాలక మండలి సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

### ముక్కంటి సేవలో మాజీ మంత్రి



మాజీమంత్రి చెంగారెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న అంజూరు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి చెంగారెడ్డి తన కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

### 'ఆప్' ర్యాలీ

వరదయ్యపాళెం: వరదయ్యపాళెంలో ఆప్ ఆద్మీ పార్టీ నాయకుల ఏర్పాటు చేసిన జెండాను ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మణినాయుడు ఆవిష్కరించారు. అనంతరం వీధుల్లో ర్యాలీగా వెళ్లి ఆప్ పార్టీ సిద్ధాంతాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గ పార్టీ కన్వీనర్ ఎంటెక్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొప్పన శ్రీనివాసులు, పార్టీ నాయకులు ఆర్‌కే పట్టెం, వెంకటచలపతి, నందిని, పార్వతి, శ్రీనివాసులు రెడ్డి పాల్గొన్నారు.

### పేకాట స్థావరంపై దాడులు

నాయుడుపేటటౌన్: మండలంలోని పుదూరు సమీపంలో పేకాట స్థావరంపై ఎస్ఈబీ సీఐ ఆర్‌యూవీఎస్ ప్రసాద్ సారథ్యంలో పోలీసులు మఫ్టీలో గురువారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న పుదూరుకు చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.8400, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

# పేదింట మెరిసిన విద్యా కుసుమాలు

ఇంటర్ పరీక్షల ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు మరోసారి తమ సత్తా చాటారు. రెక్కాడితే డొక్కాడని కుటుంబాలకు చెందిన పలువురు చదువుల్లో రాణించి శభాష్ అనిపించుకున్నారు. సరస్వతీ పుత్రికలు అనిపించుకున్నారు. తల్లిదండ్రులు పడుతున్న కష్టానికి ఫలితాల పరంగా వారి కళ్లల్లో ఆనందాన్ని నింపారు. అలాగే ప్రభుత్వ పథకాల సాయాన్ని సద్వినియోగం చేసుకుని కాలేజీలకూ పేరు తెచ్చారు.

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న రెడ్డప్పగారి కావ్య 1000 మార్కులకుగాను 970 మార్కులు సాధించి కళాశాల ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. రేణిగుంట మండలం నల్లపాలెంకు చెందిన రెడ్డప్పగారి వెంకటేష్, మునిరాజమ్మ దంపతులకు కావ్య, హాసిని, చరణ్ సంతానం. మునిరాజమ్మ వ్యవసాయ కూలీ కాగా వెంకటేష్ తాపీ మేస్త్రీ పనులతో కుటుంబాన్ని పోషిస్తున్నారు. తమ పిల్లల భవిష్యత్తుకు శ్రమిస్తున్నారు. కావ్య 10వ తరగతి వరకు పాపానాయుడుపేట జెడ్పీ హైస్కూలులో చదివింది. ఇంటర్ ఫలితాలతో కళాశాల టాపర్‌గా నిలడంతో తల్లిదండ్రులతోపాటు పాపానాయుడుపేట కాలేజీ అధ్యాపకులు గ్రామస్తులు అభినందించారు. భవిష్యత్తులో తాను డాక్టర్ అవడమే లక్ష్యంగా పెట్టుకుని చదువుతున్నట్లు కావ్య చెప్పింది.

**ఇంటర్ ఫలితాల్లో బాలికలదే పైచేయి**



కుటుంబ సభ్యులతో కావ్య

వరదయ్యపాళెం: ఇంటర్ ఫలితాలకు సంబంధించి వరదయ్యపాళెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాలికలే అత్యధిక మార్కులు సాధించారు. సెకండియర్ విద్యార్థులు 60శాతం, ప్రథమ సంవత్సరం విద్యార్థులు 45శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి తెలిపారు. సెకండియర్‌కు సంబంధించి సైన్స్, ఆర్ట్స్ విభాగాల్లో 72 మంది గాను 42 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే ప్రథమ సంవత్సరంలో 92 మంది విద్యార్థులకు గాను 41 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆమె చెప్పారు.

**కాలేజీ టాపర్లు వీరే!**

ద్వితీయ సంవత్సర ఫలితాల్లో కాలేజీ టాపర్‌గా ఎంపీసీ విభాగానికి చెందిన జి.శృతి (966) మార్కులు సాధించింది. అలాగే కె.మాధవి (933) టి.జశ్వంత్ (932) యు.హర్షిత (930), బైపీసీ విభాగంలో పి.మైమున్న సాదా (904), బి.సంధ్య (904), సీఈసీ విభాగంలో ఇ.సుసర్ల (837), వి.లక్ష్మి (765) మార్కులు సాధించారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో వై. భార్గవి (410) మార్కులు సాధించి కాలేజీ టాపర్‌గా నిలిచింది. అదే గ్రూపులో బి.యోగేశ్వరి (387), బైపీసీలో ఎం.కీర్తి (380), టి. ఉమామహేశ్వరి (371), ఎం.కన్మణి (361) మార్కులు సాధించారు.



శృతి హర్షిత సంధ్య



భార్గవి

**కేవీబీపురం విద్యార్థుల విజయకేతనం**

కేవీబీపురం: ఇంటర్ పరీక్షల ఫలితాల్లో కేవీబీపురం విద్యార్థులు విజయ కేతనం ఎగరవేశారు. స్థానిక ఆదర్శ పాఠశాల, కస్తూర్బాగాంధీ పాఠశాలల నుంచి 317 మంది ఇంటర్ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలు రాసారు. విడుదలైన పరీక్షల ఫలితాల్లో ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 93 శాతం,సెకండ్ ఇయర్ విద్యార్థులు 96 శాతం ఉత్తీర్ణులయ్యారు. ఆదర్శ పాఠశాలలో ఎంపీసీ ఫస్టియర్ విద్యార్థి ప్రేమ్‌సాగర్ 470 మార్కులకు గా ను 432 సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. కేజీబీవీ విద్యార్థిని ఎస్.వాణి 440 మార్కులకు గాను 380 సాధించి క్లాస్ ఫస్ట్‌గా నిలిచింది. విద్యార్థులను సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం అభినందించారు.



ప్రేమ్‌సాగర్



వాణి

# ఎస్సీలంటే చంద్రబాబుకు చులకన



సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి

- సంక్షేమ పథకాలతో జగనన్న జనరంజక పాలన
- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

సత్యవేడు: వెన్నుపోటుదారుడు, భూబకాసురుడు, రాష్ట్రంలో రాక్షస పాలన చేసిన చంద్రబాబుకు ఎస్సీలంటే చులకన అని డిప్యూటీ సీఎం కే.నారాయణ స్వామి అన్నారు. గురువారం సత్యవేడులో నిర్వహించిన టీటీడీ కల్యాణ మండపం శంకుస్థాపన, ప్రత్యేక సభలో ఆయన మాట్లాడారు. పేదల అభ్యున్నతికి 28 సంక్షేమ పథకాల అమలతో జనరంజక పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డిపై చంద్రబాబు కువిమర్శలు చేస్తే సహించేది లేదన్నారు. రాష్ట్రాన్ని పాలించే హక్కు జగన్‌కు లేదని చంద్రబాబు పిచ్చెక్కినట్లు మాట్లాడుతున్నారని, ఎవరి పాలనలో సంక్షేమం, అభివృద్ధి పరుగులు తీస్తోందో ప్రజలకు తెలుసన్నారు. గతంలో రాష్ట్రంలో రాక్షస పాలన చేసిన చంద్రబాబును ప్రజలు మరోమారు ఓడించి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకొందామని మహిళలను కోరారు. సత్యవేడులో ఆదిమూలాన్ని ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నేత, తాడిపత్రి నియోజవర్గ పరిశీలకుడు బీరేంద్రవర్మ, పార్టీ మండల కన్వీనర్ కే.సుశీల్‌కుమార్ రెడ్డి, మాస్టర్ స్కూల్ చైర్మన్ కే.చంద్రశేఖర్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు కే. నిరంజన్‌రెడ్డి, ఎంపీపీ వి.ప్రతిమ, జెడ్పీటీసీ పి.వి జయలక్ష్మి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ ఏవీఎం బాలాజీ రెడ్డి, ఏడు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# ఆర్‌బీకేలో 350 బస్తాల యూరియా



ఆర్‌బీకేలో యూరియాను దించుతున్న కూలీలు

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక రైతు భరోసా కేంద్రంలో 350 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, కావలసిన రైతులు పొందవచ్చని మండల వ్యవసాయాధికారిణి భారతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ రైతుల కోసం నాగార్జున కంపెనీ యూరియా ఒక బస్తా రూ. 270 లకు అందిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వరి, వేరుశనగ, మినుము తదితర పంటలను సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఇలా నమోదు చేసుకుని ప్రభుత్వ పరంగా రాయితీలు పొందవచ్చన్నారు. రైతులు ఆధార్, పొలం, బ్యాంకు పాసు పుస్తకాల జెరాక్స్, ఫోన్ నంబర్‌ను అగ్రికల్చర్ అసిస్టెంట్‌లకు అందజేసి, ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

### ఘనంగా పాఠశాల వార్షికోత్సవాలు



కొత్తవీరాపురంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఏర్పేడు: మండలంలోని కొత్తవీరాపురం, కోబాక ప్రాథమిక పాఠశాలల్లో గురువారం ఘనంగా వార్షికోత్సవాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సరస్వతీదేవి చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వసంత, ఈశ్వరి, శాంతికుమారి, శ్రీనివాసులు, సీఆర్పీ వెంకటముని పాల్గొన్నారు.

# పళ్లికొండేశ్వరుని సేవలో టీటీడీ చైర్మన్

- పూజల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే



టీటీడీ చైర్మన్‌ను సత్కరిస్తున్న బాలాజీ రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటుపల్లె శ్రీ పళ్లికొండేశ్వరస్వామిని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం కె.నారాయణస్వామి, ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. వారికి ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో కొలువుదీరిన స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చరిత్రను వివరించారు. అనంతరం ధర్మకర్తల మండలి చైర్మన్ వారికి ఆలయ మర్యాదలతో సత్కరించారు. అర్చకస్వాములు వారికి తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

**మండల కేంద్రాల్లో ఘనస్వాగతం**

సత్యవేడులో టీటీడీ కల్యాణ మండపం భూమిపూజకు విచ్చేసిన టీటీడీ చైర్మన్, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే, ఎంపీ గురుమూర్తికి పిచ్చాటూరు, నాగలాపురం మండల కేంద్రాలలో ఘనస్వాగతం లభించింది. పిచ్చాటూరు బైపాస్‌లో వైఎస్ఆర్ విగ్రహం వద్ద, నాగలాపురం బైపాస్‌లో పాత వాణిజ్య పన్నుల చెక్‌పోస్ట్ వద్ద మండల నాయకులు, పార్టీ శ్రేణులు వారికి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో స్వాగతం పలికారు.

# హంస వాహనంపై అగస్త్యేశ్వరుడు విహారం



హంస వాహనంపై అగస్త్యేశ్వరస్వామి

నారాయణవనం: మండలంలోని సముదాయంలో టీటీడీ అనుబంధ మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో గురువారం రాత్రి మేళ తాళాలు, కోలాటాల మధ్య హంస వాహనంపై ఉత్సవమూర్తులు విహరిస్తూ భక్తులను కటాక్షించారు. తొలుత ఉదయం నిత్య పూజార్చన కార్యక్రమాల అనంతరం 10 గంటలకు ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప, నైవేద్యాలను సమర్పించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ఆలయ అర్చకులు రమేష్ గురుకళ్, జమేదార్ విజయకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

### ఇంటర్ ఫలితాల్లో విక్రమ్ విద్యార్థుల హవా



చంద్రిక హేమలత మౌనిక డింపుల్



సౌమ్య సంధ్య మోక్షిత దీపిక

శ్రీకాళహస్తి: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో పట్టణానికి చెందిని విక్రమ్ జూనియర్ కళాశాల విద్యార్థులు హవా చూపారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో సి.హేమలత 969, బైపీసీలో చంద్రిక 967, ఎంఈసీలో సౌమ్య 963, సీఈసీలో నిత్య 955 మార్కులు సాధించారు. అలాగే ప్రథమ సంవత్సరం ఎంపీసీలో మోక్షిత 461, బైపీసీలో దీపిక, సంధ్య 421, ఎంఈసీలో డింపుల్ 454, సీఈసీలో స్వప్నప్రియ మౌనిక 449 మార్కులు సాధించారు. వారిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి.చంద్రశేఖర్, కరస్పాండెంట్ మునిలక్ష్మి, అధ్యాపకులు అభినందించారు.

# బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమంజరి

ఏర్పేడు: బాల్య వివాహాల నిర్మూలనకు సమష్టి కృషి చేద్దామని రేణిగుంట సీడీపీఓ కృష్ణమంజరి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. నూతన సీడీపీఓను అంగన్‌వాడీ కార్యకర్తలు పూలమాలలు, శాలువలతో సన్మానించారు. ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో బాల్యవివాహాల నిర్మూలనకు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సహకరించాలన్నారు. ప్రభుత్వం పిల్లలతోపాటు గర్భవతులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. పౌష్టికాహార లోపంతో రక్తస్రావం, మాతా-శిశు మరణాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లల ఆధార్ కార్డుల్లో పొరబాట్లు ఉంటే వాటిని పరిష్కరించాలన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పావనశ్రీ, రేవతి, ప్రజాప్రగతి ట్రస్ట్ మండల కన్వీనర్ చంద్రశేఖర్, ప్రగతి సంస్థ కన్వీనర్లు శిరీష, సుబోస్ తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటిన రాయలసీయ జూనియర్ కళాశాల



రమ్య పుష్పాంజలి వందన రాజేశ్వరి హరి గోమతి అమరనాథ్

శ్రీకాళహస్తి: పట్టణంలోని రాయలసీమ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించి సత్తా చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో 1000 మార్కులకుగాను ఎస్.రమ్య 985, కే.పుష్పాంజలి 980, బైపీసీలో వి.వందన972, మైథిలి 964, కే.తులసి 952, సీఈసీ గ్రూపులో జే.జయశ్రీ 966, ఇ.రాజేశ్వరి 947 మార్కులు సాధించారు. అలాగే ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఎంపీసీలో 470 మార్కులకు ఎన్.హరి455, సీఏ గోమతి 453,ఏఆర్ అమర్‌నాథ్ 450, సీపీసీలో 500 మార్కులకు ఆర్.కీర్తన 479, సీ.అజయ్‌కుమార్ 474, సీ.తేజ 470 మార్కులు సాధించారు. వారిని కరస్పాండెంట్ కాయం సుబ్బరామిరెడ్డి, ప్రిన్సిపల్ జయభరత్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

# ఇళ్ల స్థలాలు విక్రయించిన వారి పట్టాలు రద్దుచేయండి



పట్టాదారుల వివరాలపై ఆరాతీస్తున్న జేసీ

కేవీబీపురం: ప్రభుత్వం నుంచి ఇంటి పట్టాలు పొంది వాటిని విక్రయించి ఉంటే అలాంటి వారి పట్టాలు గుర్తించి వెంటనే రద్దు చేయాలని జేసీ డీకే బాలాజీ సిబంధిత సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన కేవీబీపురంలో పర్యటించారు. మండల కేంద్రంలోని సర్వే నం.53లో నిరుపేద కుటుంబాలకు ఇచ్చిన ఇంటి స్థలాలను పరిశీలించారు. స్థానికంగా పట్టాలు పొందిన వారు చాలా మంది విక్రయించినట్లు ఫిర్యాదులందడంతో ఒకింత అసహనానికి లోనయ్యారు. వెంటనే అలాంటి వారిని గుర్తించి పట్టాలు రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుండగా మొదటి ఫేజ్ రీ సర్వే నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని చెప్పారు. అక్రిడిటేషన్ కలిగిన పాత్రికేయులకు ఇంటి స్థలాల పంపిణీ విషయమై కలెక్టర్‌తో చర్చించి అర్హులైన వారికి ఇంటి స్థలాలు పంపిణీ చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు, తహసీల్దార్ ద్వారకనాథ్‌రెడ్డి, పార్టీ నేతలు నందకుమార్, హరిబాబు, ప్రేమ్‌కుమార్, సర్పంచ్ గిరిబాబు, ఆర్‌ఐ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

### పాఠశాల అభివృద్ధికి సహకారం

తడ: మండలంలోని రామాపురం కుప్పం ప్రాథమిక పాఠశాల అభివృద్ధితోపాటు విద్యార్థులకు అవసరమైన పలు వస్తువులను తడ పానాసోనిక్ పరిశ్రమ వారు సమకూర్చారు. ఇందుకు సంబంధించి గురువారం ఏర్పాటు చేసిన ప్రారంభ కార్యక్రమంలో పరిశ్రమ జీఎం సెంథిల్ కుమార్ చేతుల మీదుగా పాఠశాలకు వాటిని అందజేశారు. సెంథిల్ కుమార్ మాట్లాడుతూ పరిశ్రమ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా విద్యావ్యాప్తికి తమ వంతు సహకారం ఎప్పుడూ అందిస్తామని తెలిపారు. పాఠశాలకు అవసరమైన కాంపౌండ్ వాల్, ఫ్లోరింగ్ టైల్స్, పాఠశాలకు పెయింటింగ్ తోపాటు విద్యార్థులకు అవసరమైన 15 డెస్కులు, 4 టేబుళ్లు అందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసన్, హెచ్‌ఎం నాగవేణి, ఇతర పాఠశాలల హెచ్‌ఎంలు కామేశ్వరరావు, ఉస్మాన్ బాషా, సీఆర్‌పీ గోపీనాథ్ పాల్గొన్నారు.

# జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీ రాణి

శ్రీకాళహస్తి: జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి న్యాయస్థాన సీనియర్ సివిల్ జడ్జి బేబీరాణి అన్నారు. గురువారం స్థానిక న్యాయస్థాన భవన సముదాయంలో పోలీసు అధికారులతో జడ్జి సమావేశం నిర్వహించి మాట్లాడారు. మే 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు, అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించే దిశగా దృష్టి సారించాలని సూచించారు. కక్షిదారులను ఒప్పించి ఎక్కువ కేసులను పరిష్కరించడానికి దోహదపడాలన్నారు. అన్ని రకాల క్రిమినల్, సివిల్, క్రిమినల్ కాంపౌండ్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి కమల్‌కుమార్, శ్రీకాళహస్తి న్యాయస్థాన పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# వైభవంగా వరదుని ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వరదరాజస్వామి





భూమిపూజ కార్యక్రమం, పూజాద్రవ్యాలు తీసుకెళుతున్న చైర్మన్, ఈవో, సిపాయి సుబ్రమణ్యం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ భూమిపూజ గురువారం వైభవంగా జరిగింది. కార్యక్రమానికి శ్రీరంగం భీమవరం పీఠాధిపతి శ్రీరామచంద్రం నాయర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సుమారు 700 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయ పునర్నిర్మాణ పనులు సుమారు రూ.6కోట్ల వ్యయంతో చేపడుతున్నారు. గురువారం ఉదయం భూమిపూజ మహోత్సవం వైభవంగా చేపట్టారు. ఆలయ అర్చకులు, పండితుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీప్రసన్న వరదరాజస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణ నడుమ పూర్ణాహుతి కార్యక్రమాన్ని వేదోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా శ్రీరంగం స్వామిజీ రామచంద్రనాయర్ మాట్లాడుతూ ప్రతి వస్తువుకు, ప్రతి వ్యక్తికి ఏదో ఒక దశలో నిర్వీర్య దశ వస్తుందన్నారు. ప్రస్తుతం ఈ పురాతన ఆలయ పునిర్నిర్మాణం చేయడం మహోన్నతమైన కార్యక్రమని తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సహకారంతో ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమం చేపట్టామన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఈ మహోన్నత కార్యక్రమంలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమన్నారు. ఆలయ ఈవో సాగర్ బాబు, ఆర్డీవో రామారావు, ఆలయ అధికారులు, పాలకమండలి సభ్యులు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ రాముగుప్తా తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా కుంభాభిషేకం





కలశ కుంభాభిషేకం నిర్వహిస్తున్న శుకబ్రహ్మాశ్రమ స్వామీజీ, గీతామందిర ఆశ్రమ పీఠాధిపతి, శివపార్వతులకు కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకస్వాములు

- కనుల పండువగా శివపార్వతుల కల్యాణోత్సవం



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం

పిచ్చాటూరు: మండలంలోని శ్రీ లక్ష్మీగణపతి హనుమతీశ్వరాలయ మహా కుంభాభిషేకం, సకల దేవతల మహా అభిషేకం, మహా సంప్రోక్షణను గురువారం ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీకాళహస్తి శుకబ్రహ్మాశ్రమస్వామి శ్రీశ్రీశ్రీ విద్యాస్వరూపానందగిరి, నగరి మండలం కూనమరాజుపాళెం శ్రీ గీతా మందిరం ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ పుండరీక వరదానందస్వాముల సమక్షంలో విమాన గోపుర కలశ కుంభాభిషేకాన్ని అర్చకస్వాములు నిర్వహించారు. కలశ జలాన్ని స్వామీజీలు భక్తులపై చిలకరించారు. అనంతరం ఆలయ మూలవిరాట్లకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

**ఆది దంపతుల కల్యాణం కమనీయం**

సాయంత్రం 6 గంటలకు శివపార్వతుల ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో అధిష్టించి విశేష అలంకరణలు చేశారు. శ్రీ సోమనాథుని వరునిగా, పార్వతీ దేవిని వధువుగా విశేష అలంకరణలు చేసి, భక్త జన సందోహం నడుమ కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ఆది దంపతుల ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, కోలాట భజనలు, బాణసంచా మోత నడుమ ఊరేగించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జ్యోతిరాజు, ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.